
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 24 నవంబరు 2024



అడవి పిలిచింది

- విజయవాడకు అతిసమీపంలో దొంగమర్ల బావి
- మూలపాడు నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్టులోకి..



దొంగమర్ల బావి వద్ద అడవిలో పర్యాటకుల సందడి (ఇన్‌సెట్‌లో) వీరాంజనేయస్వామి



- చూపుతిప్పుకోలేని అందాలతో పర్యాటకులకు ఆహ్వానం
- చరిత్ర కలిగిన చూడచక్కని బావి
- ఆ పక్కనే వీరాంజనేయుడి ఆలయం
- వనసమారాధకులను కట్టిపడేస్తున్న ప్రాంతం
- సీతాకోకచిలుకల పార్కు సోయగాలు ఓ అద్భుతం

కథనం 8లో

అనగనగా.. ఓ అందమైన అడవి. కాకులు దూరని ఆ కారడవి ఇప్పుడు కార్తీక వనసమారాధనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీమలు దూరని ఆ చిట్టడవి సందర్శకులకు చక్కటి స్వర్గధామమైంది. ప్రకృతిపరిచిన పచ్చిక బయళ్లు.. సహజసిద్ధంగా పారే సుందర వాగులు.. మనసును ఉయ్యాలలూపే ఊడలు.. పురాతనకాలం నాటి ఓ బావి.. ఆ పక్కనే వీరాంజనేయస్వామి ఆలయం.. ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కళ్ల ముందుంచుతాయి. వందల సంఖ్యలో రంగుల సీతాకోకచిలుకలు మనసును ఇంద్రధనుస్సుగా మార్చేస్తాయి. కాంక్రీట్ జంగిల్‌లా మారిపోతున్న విజయవాడకు అతిదగ్గరలో ఇంతటి కీకారణ్యం ఉందా.. అనే సందేహం కలగకమానదు. మూలపాడుకు సమీపంలో కొండపల్లి రిజర్వు ఫారెస్టులో ఉంది ఈ అందమైన దొంగమర్ల బావి ప్రాంతం. చరిత్ర కలిగిన ఈ ప్రదేశం గత కృష్ణా పుష్కరాల సమయంలో సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఒక రూపుకొచ్చింది. తిరిగి టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో పర్యాటకులతో కళకళలాడుతోంది. ఈ ప్రాంత సందర్శన పర్యాటకులకు అలౌకికమైన ఆనందాన్ని కలిగిస్తుంది.



జాగా కనిపిస్తే పాగా

విజయవాడ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు కనిపిస్తే రియల్ మాఫియా రెచ్చిపోతోంది. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయిం చేస్తోంది. గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అనుచరులు, అంబాపురానికి చెందిన తోడేటి బ్రదర్స్ ఈ దందాలో కీలక పాత్రధారులుగా ఉన్నారు. కోట్లాది రూపాయల విలువైన కామన్ సైట్లు, యజమానులు ఇతర ప్రాంతాల్లో ఉండే స్థలాలను లక్ష్యంగా చేసుకుని ఈ రియల్ మాఫియా కబ్జాకాండను సాగిస్తోంది.

విజయవాడ రూరల్‌లో వంశీ అనుచరుల దందా

- అంబాపురంలో కామన్‌సైట్లకు నకిలీ డాక్యుమెంట్లు
- ఇతరులకు విక్రయించి సొమ్ముస్వాహా
- విజయవాడ నగరంలోనూ ఖాళీ స్థలాలపై కన్ను
- మాఫియాగా ఏర్పడి అక్రమాలు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండల పరిధిలోని అంబాపురంలో ఎఫ్‌సీఐ ఉద్యోగులు లే అవుట్ వేసుకున్నారు. రీసర్వే నెంబరు 97/2లో ఉన్న ఈ లే అవుట్‌లో ఐదు కామన్ సైట్లను వదలగా, అందులో 370 గజాలను తోడేటి సోదరులు ఆక్రమించారు. తమ తండ్రి సంసోను పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, రేకుల షెడ్డు వేశారు. ఈ ఆక్రమణలపై పంచాయతీ వారు రెవెన్యూ వారికి ఫిర్యాదు చేయగా, వీఆర్వో సర్వే చేసి కామన్‌సైట్ పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు నివేదిక ఇచ్చారు. నివేదిక ఇచ్చి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆక్రమణ మిగతా 6లో..

ఖాళీ స్థలాలే లక్ష్యంగా..

విజయవాడ నగరంలో ఖాళీ స్థలాలు ఎక్కడ ఉన్నాయో అక్కడ ఈ భూమాఫియా వాలిపోతోంది. ఆ స్థలం వివరాలు తెలుసుకుని, నకిలీ పత్రాలు సృష్టించి గుట్టుచప్పుడు కాకుండా ఇతరులకు విక్రయించేస్తోంది. కొద్దిరోజుల క్రితం గుణదలలో సుమారు 400 గజాల స్థలాన్ని ఈ ముఠా నకిలీ పత్రాలతో నున్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నించగా, చివరి నిమిషంలో హైదరాబాద్‌లో ఉన్న అసలు యజమాని రంగంలోకి దిగి వీరి గుట్టురట్టు చేశారు. సుమారు ఏడాది క్రితం అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి.. ఇండ్ల రఘుకుమార్‌కు చెందిన మూడు ఆస్తులను రూ.34.40 లక్షలకు కొన్నారు. అయితే, ఆ ఆస్తులు తమ పేరుతో ఉన్నాయంటూ ఇద్దరు తల్లీకూతుళ్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మోసపోయానని గుర్తించిన ఆ వ్యక్తి ఆ స్థలాలను విక్రయించిన ఆకునూరు నాగరాజు, మేడా శ్రీనివాసులు, తోడేటి బెంజిమన్, ఇండ్ల రఘుకుమార్‌పై గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నానికి చెందిన ఎన్.వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న సుమారు 300 గజాల స్థలానికి సైతం ఈ ముఠా నకిలీ పత్రాలు సృష్టించి రాజు చైతన్య పేరుపై తనఖా రిజిస్ట్రేషన్ చేయించేశారు. ఈ రియల్ మాఫియా అక్రమాలపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని బాధితులు కోరుతున్నారు.




కానరాని యువకుల ఆచూకీ

- గల్లంతైన యువకుల కోసం గాలింపు
- పోలవరం కాల్వలో రెండోరోజూ వెతుకులాట
- బంధువులు, స్నేహితుల ఎదురుచూపులు

6లో

పచ్చడిబండతో కొట్టి భార్య హత్య

పెదసనగల్లులో అనుమానంతో తాగుబోతు భర్త ఘాతుకం 6లో


6లో

నేడు తిరుపతమ్మకు గాజుల అలంకరణ

పట్టభద్రుల ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- ఆరు జిల్లాల్లో కలిపి 2.90 లక్షల మంది
- అభ్యంతరాల స్వీకారానికి అవకాశం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం డ్రాఫ్టు ఓటరు లిస్టును విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేసింది. ఇంచుమించుగా 40 వేలకు పైగా దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించింది. ఏ కారణంతో ఓటుహక్కును తిరిస్కరించారో కూడా దరఖాస్తుదారుడు సంబంధిత బీఎల్‌వో/ఏఈఆర్‌వోను సంప్రదించి తెలుసుకోవచ్చు. తిరస్కరించిన దరఖాస్తులపై అభ్యంతరాలుంటే నివేదించుకునే అవకాశం కల్పించింది. అలాగే, ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాకపోయి ఉంటే కొత్తగా ఫారం-18 దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2 లక్షల 90 వేల 978 మంది దరఖాస్తులను ఆమోదించి, వారికి ఓటుహక్కు కల్పిస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చి విడుదల చేశారు. ఓటరు జాబితాలను దరఖాస్తుదారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే డిసెంబరు 9లోపు తెలియజేయాలని పేర్కొన్నారు. డిసెంబరు 25వ తేదీలోపు పరిష్కరించి తుది జాబితాను 30వ తేదీన విడుదల చేస్తామన్నారు. కృష్ణాజిల్లాలో మొత్తం 56,556 మంది ఓటర్లు ఉండగా, ఎన్టీఆర్ జిల్లాలో 64,391 మంది ఉన్నారు. ఈసారి పురుష ఓటర్లే ఎక్కువగా ఉండటం విశేషం.



గ్రామాలకు స్వర్ణకవచం

స్వర్ణపంచాయతీ యాప్ ద్వారా పన్నుల వసూలు

ప్రత్యేక యాప్‌లో సర్వం నిక్షిప్తం

- ఇతరత్రా వసూళ్ల వివరాలు కూడా ఆ యాప్‌లోనే..
- పన్నుల వసూలులో అక్రమాలకు చెక్ పెట్టేందుకే..
- నేరుగా ఆ గ్రామ ట్రెజరీ ఖాతాకు జమ
- ఆ నిధులే అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగం
- వారంలో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు

పంచాయతీల్లో పాలనను గాడిలో పెట్టేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సమూల మార్పులు చేస్తోంది. స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయాన్ని, ఖర్చులను సక్రమంగా లెక్కించేందుకు, అక్రమాలు జరక్కుండా చూసేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. పంచాయతీకి సంబంధించిన ఆదాయ మార్గాలను స్వర్ణపంచాయతీ యాప్‌లో పొందుపరచాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పంచాయతీలకు వివిధ రూపాల్లో సమకూరే ఆదాయం, వసూలుచేసే ఇంటి, ఇతరత్రా పన్నులను ఇకపై ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇది నేరుగా ట్రెజరీల్లోని పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యేలా, ఫలితంగా అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరత్రా పనులకు సంబంధించిన బిల్లులను ట్రెజరీల ద్వారా తిరిగి తీసుకునే వెసులుబాటును టీడీపీ కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇందులో భాగంగానే తీసుకొచ్చిందే 'స్వర్ణపంచాయతీ' యాప్.

ఈ యాప్‌లో ఏం చేస్తారు..?

జిల్లాలో 474 పంచాయతీలున్నాయి. వీటిలో ఇంటి, ఆస్తి, ఇతరత్రా పన్నులను పంచాయతీల్లో పనిచేసే బిల్ కలెక్టర్లు లేదా అధికారులు ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది ద్వారా వసూలు చేసేవారు. ఈ సమయంలో పంచాయతీల ద్వారా బిల్లు పత్రాలను ఇచ్చేవారు. కొన్ని పంచాయతీల్లో ఇలా వసూలుచేసిన సొమ్ము పక్కదారి పట్టేది. ఈ తరహా సంఘటనలు వెలుగులోకి వచ్చి, వాటిపై ఫిర్యాదులు అంది, విచారణచేసి, రికవరీ చేసేసరికి ఏడాది నుంచి రెండేళ్లు పట్టేది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు మరింత సమయం పట్టేది. ఈ ఇబ్బందుల నుంచి పంచాయతీలను తప్పించేందుకే స్వర్ణపంచాయతీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అన్ని రకాల ఆదాయాలు..

పంచాయతీల్లోని కాల్వల్లో చేపలవేట నిమిత్తం వలకట్లు వేసుకునేందుకు, చెరువుల్లో వేలంపాటలు నిర్వహించేందుకు, ఆ తరువాత వచ్చే సొమ్మును పంచాయతీలకు జమ చేసేందుకు, కాల్వగట్లపై పచ్చగడ్డి పాటలు, భూమి యాజమాన్యంలో మార్పులు, కుళాయి పన్నులు, వ్యాపార సంస్థలు, వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించిన రెన్యువల్స్, పశువుల సంతలు, రోజువారీ వ్యాపారుల నుంచి వసూలుచేసే ఆశీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించిన అద్దెలు, డిపాజిట్లు, ఆర్వో ప్లాంట్లు, కబేళాలు, సంతలు, ఫెర్రీలు, ఆస్తివిలువను సూచించే ధ్రువీకరణ పత్రాలు, ఎన్నికల డిపాజిట్లు, వివిధ పనుల టెండర్ డిపాజిట్లు, పంచాయతీలకు వచ్చే విరాళాలు, గ్రావెల్, మట్టి తవ్వకాలకు మైనింగ్ అనుమతులు ఇచ్చే సమయంలో వసూలుచేసే నగదును కూడా ఈ యాప్‌లో మిగతా 6లో..

యాప్‌లో వివరాలిచ్చాకే పన్నుల వసూలు

ఏటా పంటలు చేతికొచ్చే నవంబరు నుంచి ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి వరకు పంచాయతీల్లో ఇంటిపన్నులతో పాటు వివిధ రకాల పన్నులను వసూలు చేస్తారు. ఈ ఏడాది ఇంకా ఇంటిపన్నులు, ఇతరత్రా వసూలు ప్రారంభం కాలేదు. స్వర్ణపంచాయతీ యాప్‌లో ఆయా పంచాయతీలకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు నమోదు చేశాకే.. అన్నిరకాల పన్నులు వసూలు చేస్తామని పంచాయతీ కార్యదర్శులు, ఈవోలు చెబుతున్నారు.

జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్

- ఏలూరు రేంజ్ అశోక్‌కుమార్

8లో

గొలుసు దొంగల అరెస్ట్

సినీ నటుడు శోభనబాబు తమ్ముడు కన్నుమూత



సాంబశివరావు (ఫైల్)

జి.కొండూరు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): సినీ నటుడు శోభన బాబు తమ్ముడు ఉప్పు సాంబశివరావు (82) అనారోగ్యంతో విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్య శాలలో కన్నుమూశారు. ఈయ నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్వగ్రామం జి.కొండూరు మండలం చిన్న నందిగామలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సాంబశివరావు మేనల్లుడు, టీడీపీ నేత వేగి రాజ శనివారం తెలిపారు.

నేడు తిరుపతమ్మకు గాజుల అలంకరణ



గాజులు సిద్ధం చేస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): తిరుపతమ్మ ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు గాజుల అలంకరణలో ఆదివారం భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శనివారం ఆలయంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సవానికి గాజులను సిద్ధం చేస్తున్నారు. అమ్మవారి గాజుల అలంకరణ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్ బీవీఎస్ఎస్ కిషోర్ కుమార్ పర్యవేక్షించారు.

చైనా నుంచి తెస్తున్న భారీ యంత్రం స్వాధీనం



రవాణాధికారులు స్వాధీనం చేసుకున్న భారీ యంత్రం

జగ్గయ్యపేట, నవంబరు 23: ట్యాక్స్ చెల్లించకుండా చైనా నుంచి కొనుగోలు చేసి తెస్తున్న భారీ యంత్రాన్ని రవాణాశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రవాణాశాఖ అధికారులు చిల్లకల్లు సమీపంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ లారీపై భారీ యంత్రం ఉండటంతో సంబంధిత పత్రాలు పరిశీలించారు. ట్యాక్సులు చెల్లించకుండా చైనా నుంచి ముంబయికి అక్కడ నుంచి రోడ్డు మార్గంలో జగ్గయ్యపేట సమీపంలోని కర్మాగారాలకు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. రూ.1.60 కోట్లు విలువచేసే ఈ యంత్రానికి ప్రభుత్వానికి కనీసం రూ15లక్షలు ట్యాక్సులు చె ల్లించాల్సి ఉంటుందని అధికారు అంచనా వేశారు. అదే విధంగా మరో బస్సును కూడా స్వాధీనం చేసుకున్నారు. యజమానులకు అపరాధ రుసుం విధిస్తామని ఎంవీఐలు ఎంవీఎస్ రాజు, జయచంద్ర తెలిపారు.

రూ.20 లక్షల విలువైన ఆభరణాలు చోరీ



చెల్లాచెదురుగా పడిన సామాను

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 23: తాళం వేసి ఉన్న ఇంట్లో రూ.20 లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురైన ఘటన మండలంలోని చిల్లకల్లులో జరిగింది. ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన జంగా రమ ఈ నెల 18న ఇంటికి తాళాలు వేసి విజయవాడలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. ఈ నెల 21న కుమార్తె విధి నిర్వహణలో భాగంగా వత్సవాయి మండల కార్యాలయానికి వెళ్లి రాత్రికి ఇంటికి రాగా, ద్వారం పగలగొట్టి ఉంది. బీరువాలో ఉండాల్సిన రూ.20 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారి సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణకవచం

(5వ పేజీ తరువాయి)

నమోదు చేస్తారు. ఈ మేరకు పక్షం రోజుల కిందటే పంచాయతీరాజ్ విభాగం కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ ప్రక్రి యను పూర్తిచేయకుండా అధికశాతం పంచాయతీల్లో నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారు. ఆదాయం వచ్చే మార్గాల వివరాలను నమోదు చేయకుండా కప్పిపుచ్చుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. స్వర్ణపంచాయతీ యాప్‌లో పూర్తి స్థాయి వివరాలు నమోదుచేసేందుకు మరో వారం వ్యవధిని ఇచ్చారు. ఈలోగా సక్రమంగా వివ రాలు నమోదు చేస్తారో లేక పక్కదారి పట్టిస్తారో చూడాలి.

పత్తి పంటకు రాకాసి గులాబీ రంగు పురుగు వ్యాపించింది. పత్తి కాయలను కరకర నమిలేస్తున్న ఈ మహమ్మారి రైతులను నిలువునా పీల్చిపిప్పి చేస్తోంది. ఖరీదైన క్రిమి సంహారక మందులకు సైతం ఈ పురుగు అదుపులోకి రావటం లేదు. ఫలితంగా దిగుబడి తగ్గటమే కాకుండా నాణ్యత కలిగిన పత్తి రావటం లేదు. ఇప్పటికే భారీ వర్షాలు, వరదల వల్ల వేలాది ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. మరోవైపు పురుగు దాడి వల్ల మిగతా పంట కూడా చేతికి అందని పరిస్థితి ఏర్పడింది. దెబ్బ మీద దెబ్బ తగులుతుండటంతో ఈ ఏడాది జిల్లాలో పత్తి రైతులు నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చింది.



'గులాబీ' గుబులు

- పత్తి పంటకు వ్యాపించిన రాకాసీ గులాబీ రంగు పురుగు
- పడిపోయిన దిగుబడి, నాణ్యత
- పకరానికి రూ.50 వేలు పెట్టుబడి
- ఇప్పటి వరకు రూ.10 వేలు కూడా తిరిగిరాని పరిస్థితి
- తీవ్రంగా నష్టపోతున్న పత్తి రైతులు



గులాబీ రంగు పురుగు



దెబ్బతిన్న పత్తి కాయ

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల): జిల్లా లోని జగ్గయ్య పేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఈ ఏడాది లక్ష ఎకరాలకుపైగా రైతులు పత్తి సాగు చేశారు. ఆగస్టు చివర్లో, సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు, వరదలకు పత్తి చేలు బాగా దెబ్బతిన్నాయి. జిల్లా అధికారుల నివేదికల ప్రకారం 35 వేల ఎకరాల్లో పత్తి చేలు దెబ్బతిన్నాయి. కొద్ది రోజుల నుంచి పత్తితీతలు జరుగుతున్నాయి. చేలు ఆశాజనకంగా లేకపోవటంతో ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి రావటం చాలా కష్టంగా మారింది.

గులాబీ రంగు పురుగు ఉధృతి

గులాబీ రంగు పురుగు జిల్లాలోనూ కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఉధృతంగా ఉంది. పలు రకాల క్రిమిసంహారక మందులు పిచికారి చేసినప్పటికీ ఈ పురుగు అదుపులోకి రావటం లేదు. పత్తి చేలను నిశితంగా పరిశీలిస్తే దాదాపుగా అన్ని కాయల్లోనూ ఈ పురుగు కనిపిస్తోంది. కాయ పైభాగంలో నల్లటి మచ్చలు తప్పితే పురుగు మాత్రం పైకి కనిపించటం లేదు. లోపలికి చొచ్చుకుపోయి పత్తి తొనలను తినేస్తోంది. పురుగు తాకిడికి పత్తి చేలు దెబ్బతింటున్నాయి.

నాణ్యమైన పత్తి రావడం లేదు

ఈ ఏడాది పత్తి పంటకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. మొదట్లో ఆశాజనకంగా ఉన్న చేలను ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన ఎడతెగని వర్షాలు, వరదలు దెబ్బతీశాయి. వర్షాలకు తేమ ఆరకపోవటంతో గూడ, పూత రాలిపోయింది. ఫంగస్ సోకటంతో కాయలు నల్లగా అయ్యాయి. పక్వానికి వచ్చినప్పటికీ విచ్చుకోలేదు. మొదటి తీత కాపు దెబ్బతింది. ఇప్పుడు గులాబీ రంగు పురుగు దాడి చేసింది. పత్తి తీతలు జరుగుతున్నప్పటికీ నాణ్యత కల్గిన పత్తి రావడం లేదు. పురుగు తినేయగా కాయలో మిగిలిన ఒకటి, రెండు తొనలు కూడా విచ్చుకోవడం లేదు. ఉండల్లా బిగుసుకుపోతున్నాయి. పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరానికి కౌలుతో కలుపుకుని రూ. 50వేలకు పైగా పెట్టుబడి అయింది. ఇప్పటి వరకు ఎకరానికి రూ. 10 వేలు కూడా తిరిగి రాలేదు. పైగా పత్తి తీతకు ఎక్కువ ఖర్చు అవుతోంది. చివరకు కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదని రైతులు వాపోతున్నారు.

పురుగు తినేసింది



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. గులాబీ రంగు పురుగు ఉధృతంగా దాడి చేసింది. కాయల్లోపలికి చొరబడి పురుగు తినేస్తోంది. ఒకటికి నాలుగు సార్లు మందులు పిచికారి చేసినప్పటికీ పురుగు చావడం లేదు. ఇప్పటికీ ఎకరానికి ఒక క్వింటా వంతున నాలుగు క్వింటాళ్ల పత్తి మాత్రమే వచ్చింది. చాలా తక్కువ ధరకు అడగటంతో అమ్మలేదు. ఇంకా ఎకరానికి ఐదు క్వింటాళ్ల లోప వస్తోంది. పత్తి నాణ్యత ఉండటం లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోవటం లేదు.

-ముక్కపాటి బాబూరావు, రైతు, గొట్టుముక్కల

తీవ్రంగా నష్టపోయాం



4.5 ఎకరాల్లో పత్తి వేయగా కౌలుతో కలిపి ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి అయింది. ఇప్పటికి రెండు క్వింటాళ్ల వంతున పత్తి రాగా, క్వింటా రూ.5600 వంతున అమ్మాను. ఇంకా నాలుగు క్వింటాళ్ల వంతున మాత్రమే వస్తుంది. రాకాసి పురుగు దాడికి చేలు కకావికలమవుతున్నాయి. పక్వానికి వచ్చిన కాయలను కూడా తినేస్తున్నాయి. సగం పెట్టుబడి కూడా చేతికి దక్కే పరిస్థితి కనిపించటం లేదు. పత్తి రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు.

-డాకూరి రామారావు, రైతు, చెవిటికల్లు

పచ్చడిబండతో కొట్టి భార్య హత్య

- అనుమానంతో తాగుబోతు భర్త ఘాతుకం
- మొవ్వ మండలం పెడసనగల్లులో ఘటన



ఘటనా స్థలం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శుభాకర్

కూచిపూడి, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): అనుమానంతో భార్యను పచ్చడి బండతో కొట్టి చంపిన ఘటన మొవ్వ మండలం పెడసన గల్లు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కూచిపూడి ఎస్ఐ ఎం. సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన తలుపుల దుర్గా చిన్న కుమార్తె శివపార్వతీ(34)కి గుంటూరు జిల్లా తాడికొండ మండలం బందరుపల్లె గ్రామానికి చెందిన తుపాకుల అశోక్‌తో 14 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరు పెడసనగల్లు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు మగ సంతానం. శివపార్వతీ కూచిపూడిలోని ఓ రెస్టారెంట్‌లో సహాయకురాలిగా పని చేస్తుంది. మద్యానికి బానిసైన అశోక్ భార్యను తరచూ వేధిస్తూ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతీని పచ్చడి బండతో కొట్టి హత్య చేశాడు. వారి ఇంట్లో నుంచి కేకలు వినిపించడంతో దుర్గ వెళ్లి చూసే సరికి అల్లుడు అశోక్ పచ్చడి బండతో కనిపించాడు. ఆమెను పక్కకు తోసేసి పరారయ్యాడు. మంచంపై రక్తపు మడుగులో శివపార్వతీ విగత జీవిగా పడి ఉంది. దీనిపై మృతురాలి తల్లి తలుపుల దుర్గ శనివారం కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న పామర్రు సీఐ శుభాకర్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బి.శ్రీనివాసాచార్య



మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా మచిలీపట్నంకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.శ్రీనివాసాచార్య ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఉంటున్న శ్రీనివాసాచార్యను రాష్ట్ర అధ్యక్ష పదవి వరించింది. శ్రీనివాసాచార్యకు ఈ నియామక పత్రాన్ని ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షునిగా ఉంటున్న డాక్టర్లు జెఎంసినాయుడు, సమరం, శ్రీహరిలు అందచేశారు. గుంటూరులో మెడికల్ కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసాచార్య ఎన్నికయ్యారు. భారతీయ వైద్య మండలి అధ్యక్షుడు ఆర్‌వి అశోక్ అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన దాదాపు 600 మంది వైద్యులు వీరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యను మచిలీపట్నం ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ బి. కేశవకృష్ణ, కోసూరు ఫణికిరణ్ తదితరులు అభినందించారు.

మట్టి మాఫియాకు వ్యతిరేకంగా ధర్నా



క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న జనసేన, టీడీపీ నేతలు

- గోపాలపురం క్వారీ వద్ద టీడీపీ నేతలతో కలిసి జనసైనికుల ఆందోళన
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పట్టు
- అధికారుల తీరుపై ఆగ్రహం

ఎ.కొండూరు, నవంబర్ 23 (ఆంధ్ర జ్యోతి): మట్టి మాఫియాపై జనసైని కులు పోరాటం మొదలుపెట్టారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల జనసైనికులు పెద్దఎత్తున గోపాలపురం క్వారీ వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కొరివి రామారావు మాట్లాడుతూ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోనే వరకు జనసేన పోరాటం ఆగదన్నారు. ఎ.కొండూరు తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో గత రెండు నెలలుగా ప్రభుత్వ, అడవి భూముల్లో అనుమతులు లేకుండా 25 లారీల్లో యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. గతంలో వైసీపీ నేత నిర్వహించిన అక్రమ క్వారీ తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఎలా వచ్చింది, దిని వెనుక రాజకీయ నేతలు ఎవరు ఉన్నరో సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. గోపాలపురం, గొల్లమందల తండా గ్రామాలకు చెందిన గిరిజనులు ఈ కొండగట్టుపై ఆధారపడి తమ పశువులు, మేకలు, గొర్రెలు పెంచుతారని తెలిపారు. అక్రమార్కులు 10 అడుగు లోతు తవ్వుతున్నారని, మట్టి మాఫియాను అడ్డుకోకపోతే ప్రజల జీవనం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్వారీని స్వాధీనం చేసుకొని అక్రమార్కులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు పుల్లారావు, విజయ్, యాసిన్, వెంకట కృష్ణారావు. నేతలు జయప్రకాష్, నవీన్, మాధవరావు, నరసింహారావు, రామకృష్ణ, సాయి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి వివేక్ యాదవ్

కృష్ణలంక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకొంటున్నట్లు చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్ అన్నారు. బిషప్ హజరయ్య ఉన్నత పాఠశాల, మాంటిస్సోరి కళాశాలలోని ప్రత్యేక శిబిరాలను శనివారం సీఈవో వివేక్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా తదితరులతో కలిసి పరిశీలించారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు సవరణలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025లో భాగంగా 2024 అక్టోబరు 29న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. ఈ జాబితాపై నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని, అదేవిధంగా 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు నమోదు చేయించుకోవచ్చని చెప్పారు. ఇలా మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించి అందిన దరఖాస్తులను డిసెంబరు 24వ తేదీలోగా పరిష్కరించి 2025 జనవరి 6న తుది జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల శిబిరాలను పరిశీలిస్తున్న ఏపీ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ నిధిమీనా తదితరులు

ఫొటో ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి: కలెక్టర్



చల్లపల్లి రాజా కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి బీఎల్వోలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఫొటో ఓటర్ల జాబితాను ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా పక్కాగా తయారు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. శనివారం చల్లపల్లిలోని ఎస్సార్‌వైఎస్పీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 61, 62 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులపై దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నడుస్తోంది. ఈ విషయమై కలెక్టర్ బూత్ స్థాయి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించాక ఏమైనా దరఖాస్తు ఫారాలు 6,7,8 వచ్చాయా అని విచారించారు. అనంతరం స్వచ్ఛ సుందర చల్లపల్లిలో భాగంగా ప్రధాన సెంటరులో సచివాలయం పక్కనే ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, బీఎల్వోలు మత్తి గోపాలకృష్ణ, గొల్లపూడి రాజేంద్ర, మట్టా అంజనేయులు తదితరులు ఉన్నారు.

కానరాని యువకుల ఆచూకీ

- గల్లంతైన యువకుల కోసం రెండవ రోజు గాలింపు ముమ్మరం
- నాలుగు కిలోమీటర్ల మేర ఎస్డీఆర్ఎఫ్ వెతుకులాట
- పోలవరం కాలువ ఒడ్డునే బంధువులు, స్నేహితులు

విజయవాడ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి సమీపంలోని పోలవరం కాలువలో గల్లంతైన ఇద్దరు యువకుల ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. రెండవ రోజైన శనివారం కూడా యువకుల కోసం ఏపీ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది బోట్ల సహాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే... అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఆరుగురు యువకులు శుక్రవారం కొత్తూరు తాడేపల్లి గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద పోలవరం కాలువలో ఈతకు దిగారు. వీరిలో ఉప్పల శివతేజ, ఎండీ ముస్వర్ ఇద్దరూ నీటి ప్రవాహానికి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం వరకు పోలీసులు, ఫైర్ సిబ్బంది వెతికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం ఏపీ ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగింది. బోట్లతో యువకులు గల్లంతైన ప్రాంతం నుంచి నాలుగు కిలోమీటర్ల పరిధిలో యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా యువకుల ఆచూకీ తెలియలేదు. దీంతో మారో మారు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టనున్నారు. శివతేజ, ముస్వర్‌ల బంధువులు వారి ఆచూకీ కోసం పోలవరం కాలువ వద్దనే పడిగాపులు కాశారు. ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది తమ బిడ్డలను తీసుకువస్తారనే ఆశతో కాలువ గట్టుపై నిలబడి ఎదురుచూడటం పలువురిని కలచివేసింది. ఓ పక్క గాలింపు చర్యలు జరుగుతుండగా మరో పక్క యువకుల బంధుమిత్రుల రోదనలు కంటతడి పెట్టించాయి.



కాలువ ఒడ్డున ఎదురుచూస్తున్న యువకుల బంధువులు, స్నేహితులు

జాగా కనిపిస్తే పాగా

(5వ పేజీ తరువాయి)

తొలగించలేదు. అంబాపురంలోనే రీ సర్వే నెంబరు 96/2బీలో 2వేల గజాలు కామన్‌సైట్‌ను కూడా ఇదే తరహాలో దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ఇత రులకు విక్రయించేశారు. రీసర్వే నెంబరు 94/3లో మరో వెయ్యి గజాల కామన్‌సైట్‌కూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి విక్రయించేశారు. ఈ నకిలీ దందాపై పంచాయతీ వారు కోర్టుకు వెళ్లగా, పంచాయతీకి అనుకూలంగా తీర్పు ఇస్తూ స్థలా న్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

పుంత పోరంబోకు స్వాహా

అంబాపురం గ్రామ రీసర్వే నెంబరు 3/2లో సుమారు 21 సెంట్ల పుంత పోరంబోకు భూమిని ఈ భూమాఫియా ఆక్రమించేసింది. పంచాయతీ వారు ఇక్కడ ఆరోగ్యకేంద్రం నిర్మించాలని తీర్మానం చేసి పనులు ప్రారంభించగా, ఆక్రమణదారులు అడ్డుకుని నిర్మాణం జరగకుండా ఘర్షణకు దిగారు.


మాంసం వ్యర్థాల లారీతో అవస్థలు

- తెలంగాణ నుంచి తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు మీదుగా గుడివాడకు రాకపోకలు
- రోడ్డంతా ఒకటే దుర్వాసన



విస్సన్నపేట, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): మాంసం వ్యర్థాల లారీ రాకపోకలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ ప్రాంతం నుంచి తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు మీదుగా ప్రతి రోజు మాంసం వ్యర్థాల లారీ ఉదయం 5 గంటల నుంచి ఆయా గ్రామాల మీదుగా వెళుతుంది. లారీ వెళ్లే మార్గంలో భరించలేనంతగా దుర్వాసన వస్తోంది. కుళ్లిన మాంసం నీరు కారి ఆ రోడ్డు వెంట పడుతుంది. ఉదయం ప్రశాంతంగా ఉండే ప్రాంతం మొత్తం దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. గుడివాడ ప్రాంతంలో ఉన్న చేపల చెరువులకు కుళ్లిన వ్యర్థాలను తరలిస్తున్నారని ఆరోపిసున్నారు. దుర్వాసన భరించ లేక వాంతులు చేసుకుంటున్నామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎలుక కరిచి మహిళ మృతి



సాయమ్మ

అజిత్‌సింగ్ నగర్ (విజయవాడ సెంట్రల్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నిద్రిస్తుండగా ఎలుక కరవడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరి పేటలో శనివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం న్యూ ఆర్ఆర్‌పేటలోని సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కొత్తకోట సాయమ్మ (52), పైడినాయుడు దంపతులు నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమారులు సంతానం. అందరికి వివాహాలు కావడంతో ఎవరికి వారు విడిగా ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం సాయమ్మ ఇంట్లో నిద్రిస్తుండగా ఎలుకో, పందికొక్కో ఇంట్లోకి ప్రవేశించి సాయమ్మ కాలును కొరికింది. దీంతో ఆమె ఉదయాన్నే చూసుకుని సబ్బుతో శుభ్రం చేసుకుని వదిలేసింది. అయితే రెండో రోజుకు కాలు బాగా బరువు ఎక్కడం, చేతి దగ్గర కూడా వాపులా నొప్పి వస్తుండటంతో భయపడిన ఆమె శుక్రవారం కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా షుగర్ కూడా లేదు ఏమీ కాదు తగ్గిపోద్దని వైద్యులు చెప్పడంతో కాస్త ధైర్యం తెచ్చుకుని, ఇంటికి వచ్చి వారు ఇచ్చిన మందులు వేసుకుంటుంది. అయితే శనివారం ఉదయం కుమారుడుతో మాట్లాడుతూ ఉన్నట్టుండి ఆమె ఒక్క సారిగా నాకు కళ్లు, తల తిరుగుతున్నాయంటూ కుప్పకూలిపడిపోయింది. ఎంతకి ఆమె మాట్లాడకపోవడంతో కుటుంబసభ్యులు వెంటనే 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అది రావడం ఆలస్యం కావడంతో ఆటోలో సింగ్‌నగర్ వైపుకు తీసుకువెళ్తుండగా 108 వాహనం ఎదురుగా రావడంతో అందులోకి ఎక్కించి ప్రభుత్వ హాస్పటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో కాసేపటికి ఆమె మృతిచెందింది. అప్పటి వరకు కళ్లముందు చలాకీగా తిరిగే సాయమ్మ ఇలా మృత్యువాత పడటంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

ఐసీఐసీసీ-2025 పోస్టర్ ఆవిష్కరణ



పెనమలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం వచ్చే ఏడాది జూలై 25, 26తేదీలలో జరిగే ఐసీఐసీసీ-2025 ఎనిమిదవ అంతర్జాతీయ సదస్సు పోస్టరును ఆవిష్కరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ, బిగ్ డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ తదితరాలపై ఈ సదస్సు దృష్టి సారిస్తుందని వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం రవిచంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్సు చైర్‌పర్సన్ ఈ లక్ష్మీలిడియా, ప్రోగ్రాం చైర్ పర్సన్లు ఎం సునిత, డీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పల్లెప్రగతి పాదయాత్రలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు, పట్టణాల్లోని పేద ప్రజల స్థితిగతులు, సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు స్వయంగా మనమే ప్రజల వద్దకు వెళ్లడం చేద్దామని కూటమి నేతలకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం యనమలకుదురులో జరిగిన తొలిరోజు పల్లె ప్రగతి పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిగడప మునిసిపాలిటీలో కాల్వకట్టలపై జీవించే పేదల సమస్యలైన తాగునీరు, మురుగుకాల్వలు, రోడ్లు, పెన్షన్లు, రేషన్ కార్డుల సమస్యలు తెలుసుకొని సదరు సమస్యలను అధికారులతో పరిష్కరించేందుకు దాదాపు ప్రతిరోజూ పాదయాత్ర చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించినప్పుడు కొత్త రేషను కార్డులు, కొత్త పెన్షన్లు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాల్వ కట్టల వెంట కూటమి నాయకులతో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొనే ప్రయత్నం చేశారు. ఆయన వెంట కూటమి నాయకులు ముప్పా రాజా, అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ షుమారు పన్నెండు లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లోని లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, శొంఠి శివరాంప్రసాద్, అంగిరేకుల మురళి, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, కాసరనేని కరుణ, ముసుబోయిన బాబు, వై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో ప్రత్యేక పూజలు

ఉయ్యూరు : ఉయ్యూరు వేణుగోపాలస్వామి, పంచప ట్టాభిరామస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల పునర్ నిర్మాణం పూర్తికాగా నిర్మాణ బాధ్యతలు చేపట్టిన పాలకవర్గం ఆహ్వానం మేరకు విచ్చేసిన బోడె ప్రసాద్‌కు ఆలయ ఏఈ ప్రసాద్, పాలకవర్గ ఛైర్మన్ లోయ చింతయ్య, డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సంతర్పణను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాలకవర్గ డైరెక్టర్ సుబ్రమణ్యం, కౌన్సిలర్లు పి.శ్రీనివాసరావు, శ్రీవాణి, ప్రభుత్వ వైద్యశాల ఇన్‌చార్జి చైర్‌పర్సన్ జయదేవ్, ఉయ్యూరు మాజీ ఛైర్మన్ ఖుద్దూస్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గుర్నాధరావు తదితరులు పాల్గొన్నారు.



నున్నలో టీడీపీ సభ్యత్వ నమోదులో పార్టీ గ్రామ నాయకులు

టీడీపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

విజయవాడ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు ఊహించి నదానికన్నా అనూహ్య స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, నేతలు మాదు శివరాంప్రసాద్, గంపా శ్రీనివాస్, బోకినాల తిరుపతిరావు పాల్గొన్నారు.



ఆకునూరులో పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

ఉయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆకునూరు, గండిగుంటలో పోలింగ్ బూత్‌లను మండల తహసీల్దార్ సురేశ్ కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ బూత్‌ల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితాలతో బీఎల్వోలు ఆదివారం కూడా అందుబాటులో ఉంటారని గ్రామాలలో ఓటర్లు జాబితాలో వారి పేర్లు పరిశీలించుకోవచ్చన్నారు. ఆర్ఐ యతేంద్రియులు పాల్గొన్నారు.

చిన్నారులు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలి



సాత్విక్‌కు మెమొంటో అందజేస్తున్న కృపానందం

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్న నాటి నుంచే గ్రంథాలయాలకు రావాలని అధికారి కృపానందం అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంలో రాణించిన డి.సాత్విక్‌కు శనివారం మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా కృపానందం మాట్లాడుతూ, చిన్నారులు పుస్తక పఠనాలను అలవరుచుకోవాలన్నారు. గుమ్మడి వెంకట్రామయ్య, కొణసాని నాగభూషణం, యలమంచిలి ప్రసాదరావు, రిటైర్డ్ రికార్డు అసిస్టెంట్ బాబూరావు పాల్గొన్నారు.



బైక్ దొంగల అరెస్టు

ఉంగుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ల దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను శనివారం ఆత్కూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన అక్బర్ బాషా, అబ్దుల్ అక్బర్, ముర్ల దేవరాజు అనే ముగ్గురు యువకులు చిన్నతనం నుంచి వ్యసనాలకు బానిసై నేరాల బాట పట్టారు. పలు దొంగతనాలు, గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడిన వీరిపై ఇప్పటికే పటమట, పెనమలూరు, కంకిపాడు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కాగా ఈ నెల 20న పెదఅవుటపల్లిలో మూడుచోట్ల మోటార్‌సైకిళ్ల దొంగతనం చేశారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన ఆత్కూరు పోలీసులు విచారణ వేగవంతం చేశారు. శనివారం ఉదయం పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద నిందితులను గుర్తించిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

చెస్‌లో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ విద్యార్థులకు ద్వితీయస్థానం

ఉయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల చెస్ టోర్నమెంట్‌లో ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, పీడీ చంద్రబాబు విద్యార్థినులను అభినందించారు.



వీరవల్లి ఆర్వోబీ నిర్మాణంపై పరిశీలన



వీరవల్లి ఆర్వోబీని పరిశీలిస్తున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే పరిధిలోని విజయవాడ-విశాఖపట్నం సెక్షన్ మధ్యలో గల వీరవల్లి ఎల్‌సీ నెం 331 రైల్వేగేటు స్థానంలో రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి ఎట్టకేలకు రైల్వే, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరవల్లి ఆర్వోబీ నిర్మాణం కోసం రైల్వే గతిశక్తి ఎస్ఎస్ఈ శ్రీనివాస్, ఏడీఈఎన్ అబ్దుల్ నజీర్, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఈఈ డి.బలరామ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైల్వే గేటు వద్ద సంయుక్త తనిఖీలు నిర్వహించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ కన్సల్టెంట్ ప్రతినిధి సయ్యద్ జాన్‌బాషా, ఆర్ అండ్ బీ జెఈఈ శ్రీహరి, రైల్వే శాఖ పీడబ్ల్యూఐ పాండు రంగారావు, గుండపనేని ఉమావరప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్య నారాయణ, మండల సర్వేయర్ ఫణికుమార్, వీఆర్ఓ సునీల్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో ఎస్పీ ప్రత్యేక పూజలు



ఎస్పీకి ఆలయ మర్యాదలతో చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు శనివారం స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజి అశోక్ కుమార్ జంక్షన్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట వచ్చి న ఎస్పీ సర్కిల్ కార్యాలయం తనిఖీ అనంతరం డీఐజీ వెళ్లిన తరువాత ఆల యాన్ని సందర్శిం చారు. ఎస్పీకి ఈవో కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో అర్చకులు ఘనంగా స్వాగతం పలి కారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస రావు మర్యాదపూర్వకంగా ఎస్పీకి నూతన వస్త్రాలు అందజే శారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై లక్ష్మీనరసింహామూర్తి ఉన్నారు.

కల్లుగీత కార్మిక నేత జంపాన రాఘవయ్య మృతి



కంకిపాడు నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుబడిన కృష్ణాజిల్లా కల్లుగీత కార్మిక నేత, ఉద్యమ పితామహుడు జంపాన రాఘవయ్య అనారోగ్య కారణాలతో శనివారం ఆయన స్వగ్రామం ఉప్పలూరులో మృతి చెందారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కల్లుగీత కార్మికుల సంక్షేమానికి జిల్లా స్థాయిలో అనేక ఉద్యమాలు నిర్వహించి, గొప్ప పేరు ప్రఖ్యాత్యులు సంపాదించారు. ఆయన మృతి పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తరగతులు

విజయవాడ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నున్న గ్రామంలోని కెనడీ హైస్కూల్ ప్రధానో పాధ్యాయురాలు రత్నకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాల బాలికలలో దేశభక్తి, క్రమశిక్షణను పెంపొందించడానికి, సమాజ సేవకులుగా తీర్చిదిద్దేందుకు 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నైతికవిలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా మాత్రమే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. వేలేరు హైస్కూల్ హెచ్ఎం విజయ్ ఆధ్వర్యంలో మానవత సహకారంతో శనివారం 'నైతిక విలువలు- వ్యక్తిత్వవికాసం' అనే అంశంపై నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత సంవత్సరం 6,7,8,9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.9వేల విలువైన నగదు ప్రోత్సాహకం, ప్రతిభా ప్రశంసాపత్రం, జ్ఞాపికను మానవత సేవా సంస్థ తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు జయరాంచంద్రరావు, కార్యదర్శి గణేష్, డైరెక్టర్ రామచంద్రరావు, రాజేశ్వరరావు, సుబ్బా చారి, తదితరులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల (పీపీసీ)ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వేంపాడు, నందమూరు, మానికొండ, తరిగొప్పల, ఇందుపల్లి గ్రామాల్లో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. పొలాల్లో పంట నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించిన ఏవో ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, రైతుసేవాకేంద్రాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ ఆలయానికి విరాళం

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి నర్రా సుబ్బారావు వెంకట పద్మావతి దంపతుల కుమార్తె లక్ష్మీ చందన రూ. 50,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, ఆలయ కమిటీ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలు సరికాదు: సీపీఎం

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు సరికాదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఈ నెల 26న జరిగే ర్యాలీపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి అన్ని రంగాలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కార్పొరేట్ సంస్థలకు దాసోహంగా పని చేస్తుందన్నారు. టీవీ లక్ష్మణస్వామి, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, రామరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయం పాత గేటు ఎదుట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ విమానాశ్రయ పాత గేటు వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో ఎగురుకుంటూ రోడ్డు అవతల పక్కకు దూసుకువెళ్లింది. అదే సమయంలో విమానాశ్రయం నుంచి ప్రయాణికులతో గన్నవరం వైపు వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. లారీ గాలిలో ఎగిరిన సమయంలో క్లీనర్ మాగంటి వీరబాబు(27) లారీ క్యాబిన్ నుంచి సడన్‌గా కిందకు దూకడంతో రోడ్డు మీద పడ్డాడు. అదే సమయంలో లారీ టైర్‌లు అతని మీదకు వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జు అయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు వాహనాలలో వారిని గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అడవి అందాలు అదరహో..!



దొంగమర్ల బావి, సీతాకోకచిలుక పార్క్ అందాలు చూడతరమా..!

కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ అంటే గుర్తొచ్చేది ఒక్క ఖిల్లా మాత్రమే. కానీ ఇంకా ముందుకెళ్తే మనం ఊహించలేని అందాలు ప్రత్యక్షమవుతాయి. మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేసే మహా వృక్షాలు తారస పడతాయి. ఇక్కడ ఇంకో విశేషమేంటంటే బ్యాంబూ వృక్షాలు మనల్ని అబ్బుర పరుస్తాయి. కార్తీక మాసం వన సమారాధన అనగానే ఈ ప్రాంత ప్రజలకు గుర్తుకొచ్చేది దొంగమొర్ల బావి. ఈ బావి సందర్శన అద్భుత అనుభూతి. ప్రకృతి సోయగాల సమాహారమది. హృదయాలను హత్తుకునేలా బిరబిరమంటూ గలగల పారే జీవ జలపు వాగుల సవ్వడి. అడుగడుగునా ఓ అందాల హరివిల్లు. ఎటువైపు చూసినా పరవశం. శ్రీ వీరాంజనేయుడి ఆలయ ప్రాంగణం అనేక వృక్షాల సమూహం. ఇక్కడ అత్యంత ఆహ్లాద, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రకృతి ప్రేమికులు చూడాల్సిన అద్భుత ప్రదేశం దొంగమర్ల బావి. దీనికి మరోపేరు సీతాకోక చిలుకల పార్క్, శీతాకాలం ప్రారంభానికి ముందు లక్షలాది సీతాకోకచిలుకలు కొలువుదీరి సందర్శకుల కళ్లకు నయనానందాన్ని కలిగిస్తాయి.

- జి.కొండూరు, ఆంధ్రజ్యోతి

- చూపుతిప్పుకోలేని సోయగాలెన్నెన్నో..!
- తేటనైన నీరు పారే వాగులు
- మంత్ర ముగ్ధుల్ని చేసే మహావృక్షాలు
- అబ్బా అనిపించే బాంబూస్
- ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా కొండపల్లి రిజర్వు ఫారెస్టు
- కార్తీక వనసమారాధనకు తండోపతండాలుగా జనం





శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం



సందడిగా మారిన ఆలయ ప్రాంగణం



పూజలు చేస్తున్న మహిళలు



భోజనాలు చేస్తున్న సందర్శకులు

కొండపల్లి రిజర్వు ఫారెస్టు ఎన్నో అద్భుత ప్రదేశాలకు నెలవై ఉంది. ఈ అడవిలోనే దొంగమర్ల బావి ఉంది. దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2014-19లో నాటి, నేటి సీఎం చంద్రబాబు ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన కృష్ణా పుష్కరాల సమయంలో కొండపల్లి ఖిల్లాపై లేజర్ షో నిర్వహించారు. ఆ సమయంలో కొండపల్లి ఖిల్లా నుంచి హెలీకాప్టర్‌లో ఈ దొంగమొర్ల వావిని, సీతాకోక చిలుకల పార్క్‌ను చూసి ఒక ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఎలా ఉంటుందని ప్రణాళికలు సిద్ధం చేశారు. సీతాకోక చిలుకల పార్క్‌ను కొంత వరకు అభివృద్ధి చేశారు. దొంగమర్ల బావి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలోపు ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం రావడం తో దొంగమర్ల బావి ప్రాంతాన్ని పర్యాటక కేం ద్రంగా అభివృద్ధి చేస్తారని పలువురు ఆశాభా వం వ్యక్తం చేస్తున్నారు. ఖిల్లాను, దొంగమర్ల బా విని, శీతాకోక చిలుకల పార్క్‌ను, పవిత్రసంగమ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దితే అటు పర్యాటకం అభివృద్ధి చెందడంతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆనందం కలుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఈ ప్రాంత వాసులకు ఉపాధి కల్పించినట్టవుతుంది.

కోరిన కోర్కెలు తీర్చే వీరాంజనేయుడు

ఈ బావి వద్ద 1976లో మూలపాడుకు చెందిన నక్కా వెంకట సుబ్బయ్య అనే భక్తుడు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాన్ని కట్టి అందులో స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో భక్తులకు ఆయన వంశీకులు అన్నదానం చేస్తుంటారు. హనుమాన్ జయంతికి ప్రత్యేక పూజలు జరుపుతారు. కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి. ఇక్కడున్న పుట్టలో పాలు పోసి కార్తీక దీపాలు వెలిగించి భక్తులు పూజలు చేస్తారు. వనభోజనాలు చేస్తుంటారు.



అడుగడుగునా అద్భుతమే..

దొంగమర్ల బావి ప్రవేశం అగుగడుగునా ఓ అద్భుతమే. మూలపాడు వద్ద సీతాకోక చిలుకల పార్క్ వద్దకు ప్రవేశించగానే అక్కడి నుంచే ప్రకృతి అందాలు పర్యాటకులను కనువిందు చేస్తుంటాయి. పార్క్‌లో ఏర్పాటు చేసిన గెస్ట్ హౌస్ ఫామ్‌హౌస్‌ను తలపిస్తుంది. ఇక్కడున్న బాంబూస్ వనం చూపరులను కట్టి పడేస్తుంది. గతంలో ఇక్కడ కొన్ని సినిమా షూటింగ్స్ కూడా జరిపారు. పిల్లలు ఆడుకునేందుకు పార్క్‌లో ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఇక అక్కడి నుంచి దొంగమర్ల బావిని ప్రవేశిస్తుండగానే ముందుగా శ్రీ వీరాంజనేస్వామి ఆలయ ప్రాంగణం తారసపడుతుంది. ఇదో అద్భుత ప్రదేశం. అనేక ఏళ్ల నాటి మహా వృక్షాలు పచ్చని పందిరిని పరిచి చల్లదనాన్నిస్తుంటాయి. ఎత్తైన చెట్ల నడుమ అక్కడే వన భోజనాలు చేస్తుంటారు పర్యాటకులు. జలజల పారుతున్న వాగు జలాలు, పక్కనే ఎవరో పెంచినట్లు వరుసగా ఎత్తైన చెట్లు ఒక క్రమ పద్ధతిలో ఉండటం వీక్షకులను కట్టి పడేస్తాయి. ముఖ్యంగా దట్టమైన అడవి అందాలు చూపు తిప్పుకోకుండా చేస్తాయి. ఎంతో విలువైన అటవీ సంపద కొండపల్లి రిజర్వు ఫారెస్టు సొంతం.

దొంగమర్ల బావికి ఆ పేరు ఎందుకు వచ్చింది

బ్రిటీష్ పాలనలోనూ, ఖిల్లాను రాజులు పాలించే రోజుల్లోనూ దొంగలు ఆయా సామ్రాజ్యాలపై పడి దోసుకున్న సొమ్మును ఒక సేఫ్ ప్లేస్‌లో దాసుకునేందుకు ముఖ్యంగా తాగునీరు దొరికే ప్రాంతంలో నాలుగు వైపులా దారులున్న ఈప్రాంతాన్ని ఎంచుకున్నారని చెబుతారు. ఈ దోచుకున్న సొమ్మును బావి వద్ద దాచుకునే ప్రాంతం కాబట్టి దీన్ని దొంగమర్ల బావి అంటారని పెద్దలు చెబుతారు. అన్ని కాలాల్లోనూ పారే నీటితో సహజసిద్ధమైన వాగులుండటం వల్లే దొంగలు ఈప్రాంతాన్ని ఎంచుకున్నారని చెబుతారు. బ్రిటీష్ కాలంలో తెల్లదొరలు 1923లో ఇక్కడో క్యాంపు కార్యాలయం కట్టుకోగా అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఇప్పుడు దాని ఆనవాళ్లు కూడా ఏం లేవని చెబుతున్నారు.

పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం

ఈ బావికి తారురోడ్డు వేసి పర్యాటక ప్రాంతం చేస్తే వాహనాల రాకపోకలతో వెలువడే కాలుష్యం కారణంగా అందమైన, ఆహ్లాదమైన ప్రకృతి పాడై పర్యావరణ సమతుల్యత లేకుండా పోతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాక కొండపల్లి రిజర్వు ఫారెస్టు ఎంతో దట్టమైంది. దారి సౌకర్యం ఉంటే అసాంఘిక శక్తులకు అడ్డాగా మారే ప్రమాదం లేకపోలేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దీనికి కాలిబాటలే కరెక్టు అంటూ వారు వాదిస్తున్నారు.



బావి వద్దకు ఎలా చేరుకోవాలి?

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి ఉత్తరంగా దొంగమర్ల బావికి వెళ్లేందుకు మొదటి మార్గం ఉంది. ద్విచక్రవాహనాలు, బస్సులు, కార్లు, ఆటోలు కొండపల్లి రిజర్వు ఫారెస్టు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న సీతాకోక చిలుకల పార్క్ వరకు అనుమతిస్తారు. అక్కడి నుంచి వాహనాలను అనుమతించరు. జూలై నుంచి అక్టోబరు వరకు సీతాకోక చిలుకలు వచ్చే సమయం కాబట్టి బావి వరకు లక్షల సంఖ్యలో చిలుకలు ఉంటాయి. అందుకే వాహనాలను అనుమతించరు. నవంబరులో వచ్చే కార్తీక వన సమారాధన సమయంలో వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో నేరుగా బావి వద్దకు వేళ్లేందుకు ఉపయుక్తంగా ఉంది. ఇది ఘాట్ రోడ్డు. జాగ్రత్తగా వెళ్లాలి. బావి వద్ద ఉన్న శ్రీవీరాంజనేస్వామి దేవస్థానం వారు ఈ దారిని ప్రతి ఏడాది శుభ్రం చేస్తూ రావడంతో మార్గం సుగమమైంది. ఇక మరో మార్గం జి.కొండూరు మండలం గడ్డమణుగు లోయ ప్రాంతంలోని ఆవుల దొడ్డి నుంచి ఉంది. ఈ దారిలో కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉంది. ఆవుల దొడ్డి వరకు ట్రాక్టర్లు, ఆటోల్లో రావచ్చు అక్కడి నుంచి ద్విచక్రవాహనాలపైనే బావికి చేరుకోవాలి. ఇక జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడు వైపు నుంచి మరోదారి, వీరులపాడు మండలం జుజ్జూరు వైపు నుంచి మరో కాలిబాట ఉన్నాయి. అవి అంత వాడుకలో లేవు. మొత్తం మీద ఫారెస్టులో కొండపల్లి, దుగ్గిరాలపాడు, మూలపాడు, జుజ్జూరు ఫారెస్టు బీట్ మధ్య ఉన్న దొంగమర్ల బావికి చేరుకోవాలంటే మూలపాడు రూట్ మంచి రహదారి.

యుగంధరాచార్యకు భారత్ విద్యా విభూషణ్ అవార్డు

వన్‌టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య నిత్యవిద్యార్థిగా రెండు డాక్టరేట్లతో కలిపి 16 డిగ్రీలు సాధించినందుకు భారత్ విద్యా విభూషణ్ అవార్డు అందచేస్తున్నామని డీకే ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీ అశోక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 24న పెరంబలూరులో జరుగుతున్న 13వ ఇండో అమెరికన్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో నేటి విద్యావిధానం చేయాల్సిన మార్పులు అనే అంశంపై యుగంధరాచార్య మాట్లాడుతున్నారన్నారు. ఇదే సమయంలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రఘునాథ్ పరక్కల్, ఫ్లోరిడా వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేషా నర్సావి, జార్జియా గ్రిగోల్ వర్శిటీ ప్రొఫెసర్ సుకుమార్ చేతుల మీదుగా అవార్డు అందచేయనున్నట్టు చెప్పారు. ఈ అవార్డు సాధించటం యావత్ భారతదేశానికే గర్వకారణమన్నారు. పాఠశాల కమిటీ సభ్యులు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ యుగంధరాచార్యకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పటమట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 68వ స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల సెపక్‌తక్రా చాంపియన్‌పోటీలు ఈ నెల 24, 25న నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు పటమట హైస్కూల్ ఆతిథ్యం ఇస్తుందని పోటీల కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్ రమేష్ వ్యవహరిస్తారన్నారు. పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పోటీలను ప్రారంభిస్తారన్నారు.

రేపు కృష్ణా వర్శిటీ ఆర్చరీ చాంపియన్‌షిప్

శాతవాహన డిగ్రీ కళాశాల నిర్వహణలో ఈ నెల 25న ఉదయం 9 గంటలకు కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాలల ఆర్చరీ పురుషుల, మహిళల చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కే శంకర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బీసీహెచ్ సంగీతరావు ఒక ప్రకటనలో తెలిపారు. వర్శిటీ పరిధిలోని అన్ని కళాశాలల జట్లు పాల్గొనవచ్చునని, 3 సెట్ల ఎలిజిబిలిటీ కాపీలు, కళాశాల ఐడెంటిటీ కార్డుతో ఆ రోజు ఉదయం 9 గంటలకల్లా రిపోర్టు చేయాలన్నారు.

మహారాష్ట్రలో పవన్ పవర్

- ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్రలోని డేగలూరు, బాక్రా, లాతూర్, షోలాపూర్ నార్త్, సెంట్రల్, బాలార్షా, చందాపూర్, పూణే కంటోన్మెంట్, కస్బా నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారని ఆయా చోట్ల అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందారన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను, బీజేపీ కూటమిని మహారాష్ట్ర ఓటర్లు ఆదరించారన్నారు.

జస్టిస్ లక్ష్మణరావు జీవితం స్ఫూర్తిదాయకం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీ ఎన్ భట్టి



జస్టిస్ లక్ష్మణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమేశ్‌కుమార్, భవానీ ప్రసాద్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి భట్టి, ఎల్వీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రామ్ పాపారావు, తదితరులు

ఆటోనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ అంబటి లక్ష్మణరావు విలువలతో కూడిన నిరాడంబర, సంపూర్ణమైన జీవితాన్ని గడిపారని, ఆయన స్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోతుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎస్వీ ఎన్ భట్టి అన్నారు. శనివారం సర్వోత్తమ గ్రంథాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా విధులు నిర్వహించిన అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్వీ ఎన్ భట్టి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ భారత న్యాయవ్యవస్థలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తుల్లో జస్టిస్ లక్ష్మణరావు ఒకరని ప్రశంసించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల నష్టపోతున్న 40 గ్రామాల రైతులకు న్యాయం చేయడంలో ఆయన కృషి ఎనలేనదన్నారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా 37 ఏళ్ల పాటు నిజాయితీగా పనిచేసిన ఆయన పదవీ విరమణ అనంతరం 28 ఏళ్ల పాటు సామాజిక సేవ చేసిన మహనీయుడని కొనియాడారు. సిటీజెన్స్ ఫర్ డెమోక్రసీ చైర్మన్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మణరావు జీవితాన్ని పూర్తిగా ప్రజా సంక్షేమానికే కేటాయించారన్నారు. లక్ష్మణరావు తనయుడు డాక్టర్ రామ్ పాపారావు మాట్లాడుతూ నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం, తాను నమ్మిన ఆశయాల అమలు కోసం శ్రమించారని వెల్లడించారు. సిటీజెన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, ఏపీ మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు కాపాడటంలో, వ్యవస్థలను బలోపేతం చేయడంలో జస్టిస్ అంబటి లక్ష్మణరావు నిర్విరామంగా కృషి చేశారన్నారు. మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదవీవిరమణ తర్వాత అవినీతి నిర్మూలన, ఎన్నికల సంస్కరణలు, రైతుల సంక్షేమం, మద్యం నియంత్రణ వంటి సామాజిక అంశాలపై లక్ష్మణరావు దృష్టి సారించారన్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు చల్లా గుణరంజన్, ఎన్.జె సూర్య, విజయ్, మండవ కిరణ్మయి, మాజీ ఐఏఎస్ అధికారి పీ.వీ రమేష, అంబటి లక్ష్మణరావు కుటుంబ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్

- ఏలూరు రేంజ్ అశోక్‌కుమార్

హనుమాన్‌జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెచ్చుమీరుతున్న సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రతి జిల్లాకు ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన హనుమాన్‌జంక్షన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గంజాయి, చిన్నపిల్లలు అక్రమ రవాణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. గంజాయి నేరస్థులు జిల్లాలు మారి నేరాలు చేస్తున్నారు. వారిపైనా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పోక్సో నేరాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వారు టెక్నాలజీని ఉపయోగించి ఓటీపీ, పాస్‌వర్డ్ ద్వారా ప్రజల అమయాకత్వాన్ని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ తరహా మోసాలకు గురైన వారు ట్రోల్ ఫ్రీ నెంబరు 1930కి సమాచారం ఇస్తే 3 గంటల్లో రికవరీ చేసే అవకాశం ఉందన్నారు. నేరం జరిగిన మొదటి 3 గంటలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. జంక్షన్‌లో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉండడం వల్ల ట్రాఫిక్ నిర్వహణ సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని విలేకరులు డీఐజీ దృష్టికి తీసుకు రాగా త్వరలో రాష్ట్ర ప్రభుత్వం 6వేల కానిస్టేబుల్స్ పోస్టులను భర్తీ చేయనుందన్నారు. జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన సర్కిల్ కార్యాలయం ఎపుడు ప్రారంభిస్తారని ప్రశ్నించగా ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ప్రారంభిస్తామన్నారు. డీఐజీ వెంట జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు ఉన్నారు. జంక్షన్ సీఐ కేవీఎస్ఎన్ సత్యనారాయణ, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది డీఐజీకి ఘనంగా స్వాగతం పలికారు. డీఐజీ పెదన పర్యటన ముగించుకొని జంక్షన్ సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. సర్కిల్ ఆఫీసు తనిఖీ ముందు మార్గమధ్యంలోని స్థానిక అభయాంజనేయ స్వామిని దర్శనం చేసుకుంటారని భావించి ఆలయం వద్ద స్వాగత ఏర్పాట్లు చేశారు. కాని డీఐజీ ఆలయం వద్ద ఆగకుండా నేరుగా సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

పెడన పోలీస్ స్టేషన్ తనిఖీ

పెడన: పెచ్చుమీరిపోతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు జిల్లాకు ఒక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి. అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావుతో కలిసి పెడన పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేరాలపై బ్యాంకర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సేవింగ్ ఖాతాల నుంచి కరెంటు ఖాతాలకు బదిలీ చేసే నగదు లావాదేవీలపై నిఘా పెట్టాలని బ్యాంకర్లను కోరామన్నారు. పెడన పోలీసు స్టేషన్ పరిధిలో శాంతి భద్రత సమస్య లేదని స్పష్టం చేశారు. ఈ స్టేషన్ పరిధిలో చీటింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ ఆధారిటీ ఆధ్వర్యంలో తరచూ సమీక్షలు జరుపుతున్నామన్నారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐలు సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ఏఎస్ఐలు సురేష్‌కుమార్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గొలుసు దొంగల అరెస్ట్.. బంగారం స్వాధీనం

ఉయ్యూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడల్లో బంగారు గొలుసులు తెంపుకెళ్లిన కేసులో ఇద్దరిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3.54 లక్షల విలువైన 59 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ తెలిపారు. ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రెండు కేసులకు సంబధించి ఇద్దరు వ్యక్తులను మీడియా ముందు ప్రవేశ పెట్టి వివరాలు తెలిపారు. విజయవాడ పాత చెక్‌పోస్ట్ సెంటర్‌లో బట్టల షాపులో మేనేజర్‌గా పనిచేసే పటమట సంజయ్ గాంధీనగర్‌కు చెందిన గుల్లంకి కిరణ్‌బాబు, ఉయ్యూరు మండలం ముదునూరు దూసరపాలెంకు చెందిన ప్రొక్లెయిన్ డ్రైవర్ చప్పిడి రామకృష్ణ స్నేహితులు. దురలవాట్లకు లోనై అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో వృద్ధ, ఒంటరి మహిళల మెడలో బంగారు గొలుసులు తెంపుకెళ్లడానికి అలవాటు పడ్డారు. ఈక్రమంలో వీరు గత ఫిబ్రవరిలో పామర్రు మండలం జమీగొల్వేపల్లిలో కిరాణాషాపులో ఉన్న మహిళ మెడలో గొలుసు తెంపుకెళ్లారు. ఈనెల 20న ఉయ్యూరు మండలం జబర్లపూడిలో రోడ్డుపై వెళుతున్న వృద్ధురాలు కొడాలి భవాని మెడలో నానుతాడు తెంపుకుని మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. ఆమె ఫిర్యాదుమేర ఉయ్యూరు రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు, కంకిపాడు ఎస్సై సందీప్, సిబ్బందితో 5ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముదునూరు శివారు వెంట్రప్రగడ రోడ్డులో పెద్ద చెరువు వద్ద బస్టాప్‌లో ఇద్దరిని శనివారం అరెస్ట్‌చేసి విచారించగా రెండు దొంగతనాలు చేసినట్టు ఒప్పుకున్నారన్నారు. బజర్లపూడి కేసును 48 గంటల్లో ఛేదించి దొంగల్ని పట్టుకుని జమీగొల్లేపల్లి కేసులోనూ రికవరీ చేయడంపై ఎస్పీ ఆర్ గంగాధరరావు, గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు ఎస్సైలు, సిబ్బందిని అభినందించి రివార్డులు ప్రకటించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైలతో పాటు, సిబ్బందికి నగదు రివార్డులు సీఐ అందజేశారు.



పట్టుబడ్డ దొంగలతో కంకిపాడు సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు సురేశ్‌బాబు, సందీప్



జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మని శనివారం సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆయనకు డిప్యూటీ ఈవో రత్నరాజు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేయగా వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ సింగ్, నిర్వాహకులు

ప్రాపర్టీ షోలలో క్రెడాయ్ అగ్రగామి

వన్‌టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాపర్టీ షోలలో క్రెడాయ్ షో అగ్రగామి అని ఎస్‌బీఐ డీజీఎం మనీష్ కుమార్ సింగ్ తెలిపారు. శనివారం క్రెడాయ్ విజయవాడ 10వ ప్రాపర్టీ షో బ్రోచర్‌ను ఆయన విజయవాడ హయత్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీ షోలలో క్రెడాయ్ నిర్వహించే షో నిర్మాణరంగానికి చెందిన అన్ని అంశాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతూ ప్రముఖంగా నిలుస్తుందన్నారు. క్రెడాయ్ విజయవాడ ప్రతినిధి దాసరి రాంబాబు, ప్రధాన కార్యదర్శి వరదా శ్రీధర్, కోశాధికారి టి.వంశీకృష్ణ పాల్గొన్నారు.

వీఆర్వోల అసోషియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

మచిలీపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నార్త్, సౌత్ మండలాల వీఆర్వో అసోసియేషన్ల ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. మచిలీపట్నం నార్త్ మండల వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడిగా మోటుపల్లి రాజమోహనరావు, కార్యదర్శిగా చలమలశెట్టి హేమంత్, కోశాధికారిగా బాపట్ల అనిల్ జాషువా ఎన్నికయ్యారు. మచిలీపట్నం సౌత్ మండల వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడిగా కొట్టి శ్రీవెంకటనాగబాబు, కార్యదర్శిగా ఏకుల సతీష్, కోశాధికారిగా శీలం దుర్గాసురేంద్ర ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను వీఆర్వో సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోన అంజనేయకుమార్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పేపేటి సత్యనారాయణ, ఏపీ సీపీఎస్ నేతలు గోరిపర్తి శ్యాంకుమార్, తుమ్మూరు శేఖర్ పర్యవేక్షించారు.



పోస్టల్ ఉద్యోగి మోసాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

న్యాయం చేయాలంటూ బాధితుల ధర్నా

గుడ్లవల్లేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విన్నకోట పోస్టాఫీసులో గ్రామీణ్ డాక్ సేవక్ (జీడీఎస్)గా విధులు నిర్వహిస్తున్న వరుణ్మయి ఖాతాదారులను మోసం చేసి డబ్బుతో ఉడాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ శనివారం రాత్రి బాధితులు గ్రామంలో ధర్నాకు దిగారు. తమకు తక్షణం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జనార్ధన స్వామి ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమిస్తామని సీపీఎం నేత బి.వి.శ్రీనివాస్ అన్నారు. అమాయక ప్రజల సొమ్ము జమలను పాస్ పుస్తకాలో వేయించాల్సిన పోస్టల్ శాఖ అధికారులు ఆ పాస్‌పుస్తకాలనే తమ ఆధీనంలోకి తీసుకొని బాధితులను తిప్పించుకోవడం అన్యాయమని శ్రీనివాస్ మండిపడ్డారు. బాధితులందరికీ వారు జమచేసిన సొమ్ముకు పాస్‌పుస్తకాల్లో ఎంటర్ చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.590

టీ తాగుతూ ప్రజలతో మమేకమైన మంత్రి రవీంద్ర



మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి బుట్టాయిపేట సెంటర్‌లో టీ తాగుతూ ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. తాగునీరు కలుషితంగా వస్తోందని కొందరు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, ఐదేళ్లుగా హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఫిల్టర్‌బెడ్‌లను పూడికతీయలేదన్నారు. మునిసిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఒకటి రెండు రోజుల్లో స్వచ్ఛమైన తాగునీరు అందరికీ అందుతుందన్నారు.



కొల్లు ఫౌండేషన్ క్రికెట్ టోర్నీకి మంచి స్పందన

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోబుల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీకి మంచి స్పందన లభించింది. మూడో రోజు కింగ్స్ 11, సీఎస్‌కే -2 మధ్య జరిగిన మ్యాచ్‌లో కింగ్స్ 11 జట్టు 8.2 ఓవర్లలో 59 పరుగులకు ఆలౌట్ అవ్వగా సీఎస్‌కే-2 జట్టు 6.2 ఓవర్లలో 60 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రెండో మ్యాచ్‌లో సీఎస్‌కే 11, చిలకలపూడి రైడర్స్ మధ్య జరిగిన ఇన్నింగ్స్‌లో సీఎస్‌కే 11 టీమ్ 10 ఓవర్లలో 128 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో చిలకలపూడి రైడర్స్ 76 పరుగులు చేయడంత సీఎస్‌కే 11 టీమ్ 52 పరుగుల తేడాతో విజయం సాధించింది. రాయల్ చాలెంజర్స్, బందరు శక్తి లెవెన్ మధ్య జరిగిన మూడో మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్‌లో రాయల్ చాలెంజర్స్ 10 ఓవర్లలో 145 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో శక్తి లెవెన్స్ 89 పరుగులు చేసి ఆరు వికెట్లు కోల్పోయింది. రాయల్ చాలెంజర్స్ 56 పరుగులతో విజయం సాధించింది.

డాకూమహరాజ్, జేఎస్‌కే జట్ల మధ్య జరిగిన నాలుగో మ్యాచ్‌లో డాకూ మహరాజ్ 97 పరుగులకు మూడు వికెట్లు సాధించగా, జేఎస్‌కే 10 ఓవర్లకు 60 పరుగులు చేసి ఏడు వికెట్లు కోల్పోయి డాకూమహరాజ్ జట్టు 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. క్రీడాకారులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొల్లు పునీత్ అభినందించారు.

కాపు వనసమారాధనకు విస్తృత ఏర్పాట్లు



మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌రోడ్డులోని కొండపల్లి సోమయ్య ఎస్టేట్స్ లో ఆదివారం నిర్వహించనున్న కాపు కుటుంబీకుల ఆత్మీయ కలయికకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు కొట్టి వెంకట్రావు తెలిపారు. కాపు కులానికి చెందిన రాజకీయ ప్రముఖులు, అధికారులు, కళాకారులు వివిధ రాష్ట్రాల నుంచి హాజరవుతారనన్నారు. దామోదర పూజలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, వివాహ పరిచయ వేదిక వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెంకట్రావు తెలిపారు.

బంటుమిల్లి సబ్ ట్రెజరీ తనిఖీ

బంటుమిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని శనివారం జిల్లా ఖజానా అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. పెన్షనర్లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్టీవో గోపీకృష్ణ, చక్రధర్, సత్యనారాయణ, యూనస్, వెంకటేశ్వరరావు, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు గంగాజలరావు తదితరులు పాల్గొన్నారు.



శబరిమలకు సైకిల్ యాత్ర

మోపిదేవి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి శబరిమలకు ముగ్గురు అయ్యప్ప స్వామి దీక్షతో సైకిల్ యాత్ర చేపట్టారు. శనివారం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అయ్యప్ప భక్తులు పి.శ్రీనివాసరావు, యు. చంటిబాబు, కె.కాశేశ్వరరావులకు భక్తులు స్వాగతం పలికి పూలు, పండ్లు, ఫలహారం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు.



బంగారపు నెక్లెస్‌ను ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దాతలు

అమ్మవారికి బంగారపు నెక్లెస్

మోపిదేవి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెరకనపల్లి పంచాయతీ శివారు టేకుపల్లిలో కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో బాలపార్వతీ సమేత రామేశ్వరస్వామికి రూ.4 లక్షల విలువ గల బంగారపు ఆభరణాలను వేమూరి శివరామప్రసాద్ - శివప్రియ దంపతులు సమర్పించారు. కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆలయ కమిటీ సభ్యులు వెంపటి కుటుంబ శాస్త్రి, వేమూరి నాగేశ్వర శర్మలకు బంగారపు నెక్లెస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ శ్రీధర్, లంక ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇరిగేషన్‌కు జవసత్వాలు కల్పిస్తాం

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పులిగడ్డ ఆక్విడెక్ట్ ఎల్‌ఎఫ్‌ఆర్ లాకుల కొత్త గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో నామరూపాలు లేకుండాపోయిన ఇరిగేషన్ రంగానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రాబు నాయుడు జవసత్వాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు.

మోపిదేవివార్పు వద్ద పులిగడ్డ ఆక్విడెక్ట్ ఎల్‌ఎఫ్‌ఆర్ లాకులకు రూ.8.70 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన గేట్లను శనివారం ఆయన పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులు కూడా కాల్వలను నిర్లక్ష్యం చేసిందన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు గురైన గేట్లు వరద నీటి ప్రవాహంతో పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. వరద నిధుల్లో రూ.8.70 లక్షలతో కూటమి ప్రభుత్వం కొత్త గేట్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. దివిసీమ ప్రాంతానికి జీవనాడిగా ఉన్న పులిగడ్డ ఆక్విడెక్టును సమగ్రంగా ఆధునికరించే చర్యల్లో భాగంగా కోటి 20 లక్షలు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తు నిధుల నుంచి మంజూరు చేసిందన్నారు. దివిసీమ రైతులను తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్న అవుట్ ఫాల్ స్లూయిస్‌లు ఆధునీకరించేందుకు ఇప్పటికే ప్రభుత్వం జలవనరుల శాఖ ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నివేదికల ఆధారంగా రాబోయే వేసవికాలంలో అవుట్ ఫాల్ స్లూయిస్‌లకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈలు రవితేజ, టి.ప్రసాద్, విజయ్, టీడీపీ, జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, నడకుదుటి జనార్దనరావు, రావి రత్నగిరి, డొకిపర్తి బాలకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

డాక్టర్ లక్ష్మీకమలకు ప్రముఖుల నివాళి

● డాక్టర్ మధుసూదనరావు కుటుంబానికి పరామర్శ, ప్రగాఢ సానుభూతి

చల్లపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో శుక్రవారం కన్నుమూసిన డాక్టర్ పింగళి లక్ష్మీకమల భౌతికకాయాన్ని పలువురు వైద్యులు, పురప్రముఖు సందర్శించి నివాళులర్పించారు.డాక్టర్ ఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ నల్లూరి రవీంద్రనాథ్, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ సబ్బినేని భవానీప్రసాద్, డాక్టర్ నల్లపనేని కీర్తి, డాక్టర్ కె.చంద్రశేఖరరావు, డాక్టర్ సుధాకర్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, ప్రముఖులు ల్యాబ్ రవి, కోనేరు మారుతీప్రసాద్, పత్రి హనుమంతరావు, కోనేరు బలరాం, రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్ తదితరులు లక్ష్మీకమల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. భర్త డాక్టర్ మధుసూదనరావు, కుమారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శరత్‌శ్చంద్రలను పరామర్శించి సానుభూతి తెలిపారు. లక్ష్మీకమల భౌతికకాయానికి అంతిమయాత్ర నిర్వహించగా, గౌరవ సూచకంగా డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్ వాహనాన్ని స్వయంగా శ్మశానవాటిక వరకు నడిపారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జొన్నలవారిమోడి అంగన్‌వాడీ కేంద్రానికి పి.రామారావు పరికరాలను అందజేశారు. సీడీపీవో గ్లోరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

ఘంటసాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా జయంతిని లంకపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కేక్ కట్ చేసి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. సత్యసాయి బాబా మందిరాన్ని ఆయన ప్రారంభించారు. మండలి వెంక ట్రామ్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గురూజీ శ్రీనివాస్, చల్లపల్లి వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, పరిశె చలపతి తదితరులు పాల్గొన్నారు. ఘంట సాలలోని సత్యసాయి మినీ కల్యాణ మండపంలో సాయిబాబా జయంతిని ఘనంగా ఘనంగా నిర్వహించారు. సాయి సేవా సమితి సభ్యు లు సాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. వ్యాసరచన పోటీల్లో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సత్యసాయిసేవా సంస్థల విద్యావిభాగం కో-ఆర్డినేటర్ డి.సాయిజ్యోతి, ఉపాధ్యాయులు రంగవల్లి, బసవేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీహరిప్రసాద్, బాలసుందర్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు చీరెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు ఆర్థిక సాయం చేశారు. యెండూరి సురేష్, రేణుకారాణి, శిరీష, రంగనాయకులు, అన్నం అశోక్, వి.ఎస్.కె. మూర్తి, జె.రాంబాబు, వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

మోపిదేవి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టేకుపల్లిలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలోని బాలాపార్వతీ సమేత రామేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని లోక కళ్యాణార్థం మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీసీ రోడ్డు, గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఘంటసాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగురావుపాలెం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8.50 లక్షలతో నిర్మించే సీసీ రహదారి పనులను టీడీపీ నాయకులు గుత్తికొండ కల్యాణ్, ఉపసర్పంచ్ దేవినేని పద్మప్రియ ప్రారంభించారు. గోకులం షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్‌లు ఆరుంబాక రవి, పైడిపాముల నెహ్రూ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పెడన రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలని మండల వ్యవసాయాధికారిణి నూరున్నిసా అన్నారు. రైతులు ముందుగా తమ వద్ద ఉన్న ధాన్యం వివరాలను రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకుని విక్రయిస్తే 48 గంటలలో నగదు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. ఇప్పటి వరకు 260 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతుల వద్ద కొనుగోలు చేశామన్నారు. ధాన్యం విక్రయానికి దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు.

సమగ్ర కులగణనతో బీసీలకు న్యాయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.వి.వి. సత్య నారాయణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లకోసారి కుల కుల గణన చేపట్టకపోవడంతో బీసీలు నష్టపోతున్నారన్నారు.వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, దేవిక, భాస్కర్, అంజనేయులు, కిషోర్, నూరిబాబు పాల్గొన్నారు.

పోటుమీద టీడీపీ సభ్యత్వ నమోదు

కోడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అని మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. వంద రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే రూ.ఐదు లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. పోటుమీద గ్రామంలో బూత్ కన్వీనర్లు బావిశెట్టి శ్రీనివాస రావు, ఉప్పాల నాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పాల వెంకట కోటేశ్వరరావు, ఉప్పాల పోతురాజు, బావిశెట్టి శ్రీనివాసరావు, ఉప్పాల నాగరాజు, బెల్లంకొండ జగన్మోహనరావు, వాకా వసంతరావు, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.590

దురలవాట్లుకు దూరంగా ఉండాలి

గుడ్లవల్లేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో ఫార్మశీ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. గుడ్లవల్లేరులో వీధి నాటకం, సాంస్కృతిక ప్రదర్శనలో ప్రజల ఆరోగ్య శైలి మద్యం, ధూమపానం వంటి దురలవాట్లకు దూరం ఉండాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఐపీఎ గుడ్లవల్లేరు చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవీష, వైస్ ప్రెసిడెంట్ కె.పరిమళ, సెక్రటరీ డాక్టర్ ఎ.సాయిధాత్రి పాల్గొన్నారు.



చిత్రంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫార్మశీ విద్యార్థులు



చెక్కులను అందజేస్తున్న వెనిగండ్ల, రావి

కష్టకాలంలో ఆదుకునేదే సీఎం సహాయనిధి

గుడివాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : కష్టకాలంలో పేదలను ఆదుకునేది సీఎం సహాయనిధి అని, వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అనేక విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజావేదికలో బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మోటూరు గ్రామానికి చెందిన టి.రమణకుమారికి రూ.1.02 లక్షలు, బిళ్లపాడుకు చెందిన చింతా పుష్పకుమారికి రూ.1.10 లక్షలు, నందివాడ మండలం వెన్ననపూడికి చెందిన సూరపనేని ఝాన్సీరాణికి రూ.1.62 లక్షల చెక్కులను వెనిగండ్ల, రావి అందజేశారు. టీడీపీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పదవికి వన్నె తెస్తా: రావి

గుడివాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మంతో ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణవేణి ఆయిల్ మిల్‌లోని వ్యక్తిగత కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని, దానికి తానే నిదర్శనమని, చాలా గర్వంగా ఉందన్నారు. తనపై నమ్మకాన్ని ఉంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి కొల్లు రవీంద్ర, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని చిన్ని, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పార్టీ జాతీయ కార్యదర్శి వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజు, కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, రాష్ట్ర నాయకులు, తెలుగు యువత, తెలుగు మహిళలకు ప్రత్యేకంగా రావి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

చదరంగంలో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుడివాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చదరంగం పోటీల్లో డా.కెకెఆర్స్ గౌతమ్ విద్యార్థులు జూనియర్స్ విభాగంలో పి.మోహిత్ ప్రథమ, సిహెచ్ శర్వానాదర్శ్ ద్వితీయ, సబ్ జూనియర్స్ విభాగంలో ఎం.దియాన్ ప్రథమ, ఆర్.గౌరి ఇషిక ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. పాఠశాల ఆవరణలో విజేతలను అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్ స్వర్ణలతను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్జాతీయ క్రీడలు నిర్వహిస్తాం

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు



స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన యలవర్తిని సత్కరిస్తున్న వెనిగండ్ల, రావి

గుడివాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయ క్రీడలను నిర్వహించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. క్రీడాభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సహకారంతో స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడిగా యలవర్తి ఏకగ్రీవం

ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఎన్నికల్లో యలవర్తి ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్టేడియం కమిటీ కార్యదర్శి, ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావులు బలపరిచిన మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్యానల్ 14మందిని పోటీలో నిలిపింది. నిర్ణీత సమయంలోపు యలవర్తి ప్యానల్ మినహా ఎవరూ నామినేషన్‌లు వేయలేదు, దీంతో యలవర్తి ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బాలసుబ్రహ్మణ్యం ప్రకటించారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా కిలారపు రంగప్రసాద్‌లతో పాటు 12మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. గెలుపొందిన యలవర్తి ప్యానల్‌ను స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అభినందించారు. నూతన కమిటీని పట్టణ ప్రముఖులు అభినందించారు. అంతర్జాతయ క్రీడాకారులను అందించ డమే లక్ష్యంగా భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామని, అన్న ఎన్టీఆర్ ఆశయాలను నెరవేరుస్తామని కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ప్యానల్

నిరసన విజయవంతం చేయండి

గుడివాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన దేశవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో జరిగే ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. మార్వాడీ గుడి సెంటర్‌లో కార్మికులను కలిసి నిరసన కార్యక్రమం కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ కొమ్ముల సురేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సివి రెడ్డి, సాహితీ స్రవంతి పట్టణ అధ్యక్షుడు లంకా సురేంద్ర, నాయకులు షేక్ మూసా, సింగవరపు రాంబాబు, జి.మూర్తి, బాషా, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గౌతమ్ అదానీని అరెస్టు చేయాలి

గుడ్లవల్లేరు : సౌర విద్యుత్ కొనుగోళ్లలో తీవ్ర అవినీతికి పాల్పడిన గౌతమ్ అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం గుడ్లవల్లేరులో సీపీఎం నాయకుడు బి.వి శ్రీనివాస్ నేతృత్వంలో నిరసన ప్రదర్శన చేశారు. కొడాలి సతీష్, కొడాలి నాని, మామిడి హితేష్, మామిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఇరుముడులు



పామర్రు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప దీక్షాపరులు శివాలయంలో మాగంటి వెంకటరత్నం గురుస్వామితో ఇరుముడులు కట్టించుకుని అయ్యప్పను దర్శించుకునేందుకు శబరిగిరి యాత్రకు పయనమయ్యారు. అయ్యప్ప నామస్మరణలతో శివాలయం మార్మోగింది. భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సినీనటుడు దుర్గాప్రసాద్, జనసేన పామర్రు ఇన్‌చార్జితాడిశెట్టి నరేష్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ : చిరు వ్యాపారులు పీఎం స్వానిధి రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలని మెప్మా సీఎంఎ బసవేశ్వరరావు అన్నారు. బేతవోలులోని పెద్దపేటలో చిరువ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. చిరువ్యాపారుల అభివృద్ధి కోసం పీఎం స్వానిధి రుణాలను అందిస్తున్నారన్నారు. ఇండియన్ బ్యాంకు మేనేజర్ డి.పృధ్విరాజ్, ఐసీడీఎస్ ఏసీడీపీవో ఎం.పద్మ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బిందు, మెప్మా సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

చౌటపల్లిలో లక్ష బిల్వార్చన



గుడివాడ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చౌటపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష బిల్వార్చన శనివారం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు, భక్తులు పాల్గొనగా ఆలయ అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష బిల్వార్చన చేశారు.

గోకులం షెడ్లకు ప్రాధాన్యతనివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

గుడివాడ రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : గోకులం షెడ్లకు అత్యంత ప్రాముఖ్యత నివ్వాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోకులాల షెడ్ల నిర్మాణ పనులపై శ్రద్ధ వహించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లోని నాయకులతో కలిసి వారికి సమాచారం అందించి పనులు నిర్వహించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అయ్యంకిలో ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న తహసీల్దార్ మస్తాన్

కూచిపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం రెండు రోజులపాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను శనివారం తహసీల్దార్ మస్తాన్, ఇతర రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. అయ్యంకి, పెద నసగల్లు, భట్లపెనుమర్రు, కూచిపూడి కేంద్రాలను తహసీల్దార్‌తోపాటు ఆర్ఐ విజయదుర్గ పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ రామ్మోహనరావు మొవ్వ, గూడపాడు, పెదపూడి, యద్దనపూడి గ్రామాల్లో గల నమోదు కేంద్రాలను పరిశీలించి ఓటర్ల నమోదు ప్రక్రియ వివరాలు సేకరించారు. ఆదివారం కూడా ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తహసీల్దార్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన

పామర్రు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా జాబితాను తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఎన్నికల డీటీ రజనీకాంత్ ప్రకటించారు. జాబితాలో అభ్యంతరాలు ఉన్నట్లయితే డిసెంబర్ 9లోగా స్వీకరిస్తామన్నారు. అంతేకాకుండా ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ జరుగుతోందని నూతన ఓటర్లు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చునన్నారు. ఎన్నిక విభాగం సీనియర్ అసిస్టెంట్ జి.అనినయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : కృష్ణా - గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితాను సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్, గుడివాడ మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల వద్ద ప్రదర్శిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. అర్జీదారులందరూ పరిశీలించుకుని అభ్యంతరాలుంటే తెలపవచ్చన్నారు.

రహదారి గోతులను పూడ్చాలి

గుడివాడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణ నడిబొడ్డులో రహదారి గోతులను పూడ్చాలని కోరుతూ సీపీఎం నేత ఆర్సీపీ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బస్టాండ్ నుంచి ఏజీకే పాఠశాలకు వెళ్లే రహదారి పూర్తి ధ్వంసమవ్వడంతో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పి.రజిని, రేపాని కొండ, ఎల్.సురేంద్ర, ఎ.విజయ్‌కుమార్, నాని తదితరులు పాల్గొన్నారు.

బీమా రంగంలో అవకాశాలపై అవగాహన

గుడివాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీమా రంగంలో వృత్తి అవకాశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎల్ఐసీ గుడివాడ బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనాథ్ అన్నారు. ఎఎన్ఆర్ కళాశాలలో కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో బీమా రంగంలో వృత్తి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనాథ్ మా ట్లాడుతూ బీమా రంగంలో ఉపాధి అవకాశాలు మెండు గా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి. జె.ఎస్ కుమార్, పాలక వర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్.ఆర్.కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి. ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు నాగేంద్రకుమార్, ప్రసాద్, జేసుబాబు, గ్రీష్మ, విమల కుమారి, ఎం.బి.ఎ అధ్యాపకులు పాల్గొన్నారు.

చాపరాల అన్వేష్‌కు కీలక పదవి

గుడ్లవల్లేరు, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ 2.0 మున్సో రీ చాప్టర్ జాయింట్ కో-ఆర్డినేటర్‌గా గుడ్లవల్లేరు కు చెందిన ప్రవాస భారతీయుడు చాపరాల అన్వేష్ ఎంపికయ్యారు. గుడ్లవ ల్లేరు మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ ద్వితీయ కుమారుడు అన్వేష్, ఎల్‌కేజీ నుంచి ఇంజనీరింగ్ వరకూ గుడ్లవల్లేరులోనే విద్య అభ్యసించి ఉన్నత విద్యలకు అమెరికా వెళ్లి, ఉద్యోగంలో స్థిరపడ్డాడు.